నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం | మార్చి 16, 2025 | www.navatelangana.com

పక్షుల దాహార్తి తీర్చండి



నవతెలంగాణ-నిజామాబాద్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గ్రౌండ్‌లో చుట్టూ వందలాది చెట్లు ఉన్నాయి. ఆ చెట్లపై వేలాది పక్షులు నివాసం ఏర్పరుచుకుంటాయి. ప్రస్తుతం ఎండాకాలం నేపథ్యంలో వాటికి తాగడానికి నీటి తొట్టిలు ఏర్పాటు చేయాలని వాకర్స్ కోరుతున్నారు. గత సంవత్సరం అంతకుముందు ఏర్పాటు చేసినట్టు ఈసారి కూడా పక్షల కోసం గ్రౌండ్ చుట్టూ నీటి సదుపాయం కల్పించాలని వాకర్స్ కోరుతున్నారు.


జీపీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ

- ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

నవతెలంగాణ-దోమకొండ

గ్రామపంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసిన కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్రవంతి శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన మంగళపల్లి శ్రావణ్ కుమార్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకంతో ఫోర్జరీ చేసి పత్రాలు రసీదులు, సృష్టించి వాటితో ఓ బ్యాంకులో ఇతరుల పేరు మీద ఉన్న గోల్డ్ లోన్ చెల్లించి, తన పేరు మీద గోల్డ్ లోన్ బ్యాంకులో తీసుకున్నాడు. దోమకొండ గ్రామానికి చెందిన చింతల రవీందర్ అనే వ్యక్తి కోర్టు ష్యూరిటీల పత్రాల విషయంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సంతకంతో ఫోర్జరీ చేసి పత్రాలు సృష్టించాడని, దోమకొండ గ్రామపంచాయతీ కార్యదర్శి యాదగిరి ఫిర్యాదు మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై స్రవంతి తెలిపారు తెలిపారు.

ఆశలు తీర్చేనా..?



- రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లా వాసుల ఎదురుచూపులు
- విద్యా, వైద్యం, వివిధ రంగాలకు కేటాయింపులపై గంపెడాశలు
- పెండింగ్ పనులు ముందడుగువేసేనా..?

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈ నెల 19న రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌పై జిల్లా వాసులు గంపెడాశలు పెట్టుకున్నారు. విద్యా వైద్యంతో పాటు వ్యవసాయం, వివిధ రంగాలకు కేటాయింపులు, అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు కేటాయింపులు జరిగేనా అని చర్చ కొనసాగుతోంది.

విద్యారంగంపై..

నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళా కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చినప్పటికీ ఇప్పటికీ ఎటువంటి బడ్జెట్‌ని కేటాయించలేదు. తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధికి తోడ్పాటు మాథ్స్, కెమిస్ట్రీ, ఇంజనీరింగ్, బయాలజీ, మైక్రో బయాలజీ, సైన్స్, ఆర్ట్స్ కోర్సు లకు అప్ గ్రేడ్ చేయడంతో పాటు టీయూలో అధ్యాపకుల నియామకానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. అదనపు బడ్జెట్ కేటాయిస్తే ఇవన్నీ కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. కానీ ప్రతేడాది.. బడ్జెట్‌లో కేటాయించే నిధులు టీయూ నిర్వహణకు సైతం సరిపోవడం లేదనే ఆరోపణలున్నాయి. నిజామాబాద్ జిల్లాకు వస్తున్న నవోదయ స్కూల్‌కు సంబంధించి స్థలం కేటాయించడం గురించి, నిజామాబాద్ అర్బన్‌లో 2 కేజీబీవీలు ఏర్పాటు చేయుటకు సాంక్షన్ అయినప్పటికీ భవనాలు లేక కేజీబీవీలు ఏర్పాటు చేయలేకపోతున్నారు. దానికి ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించాలని విద్యార్థి సంఘాలు, జిల్లా వాసులు కోరుతున్నారు. బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయిస్తే.. ప్రభుత్వ విద్యారంగం బలోపేతం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

వైద్యరంగంపై..

నిజామాబాద్ జిల్లాకే పేరు గాంచిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)కి నిజామాబాద్ సరిహద్దులో ఉన్న పలు జిల్లాల నుండి వైద్య సేవల కోసం పేద ప్రజలు, నిరుపేదలు ఎంతో మంది వచ్చి వైద్యం పొందుతుంటారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ప్రత్యేకంగా నిధులు అందించి 1000 పడగల ఆసుపత్రితో పాటు సూపర్ స్పెషాలిటీ సెవలు అందించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. అందులో న్యూరో, గ్యాస్ ట్రో, ఎండోక్రైనలజిస్ట్, క్యాన్సర్ సౌకర్యాలను, మహానగరానికి కి దీటుగా ఉస్మానియా, గాంధీ వంటి ఆసుపత్రులలో ఉన్నటువంటి సేవలను కూడా ఇక్కడ అందించే విధంగా ఉండాలని, దానితోపాటు ఎంఆర్ఐ స్కానింగ్ చేసే పరికరాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి అందించాలని అందుకు ప్రత్యేక బడ్జెట్ ని కేటాయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

సాగులో ముందడుగు పడేనా..

వ్యవసాయ రంగం అభివృద్ధి.. అనుబంధ పరిశ్రమలపై జిల్లా రైతాంగం ఎదురుచూస్తుంది. బోధన్ చక్కెర కర్మాగారాన్ని ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వీలైనంత తొందరలో రైతులకు అందుబాటులోకి వచ్చే విధంగా ఉండాలని, దాంతో చక్కెర కర్మాగారం ప్రారంభించడంతో అక్కడ రైతులకే కాకుండా రైతు కూలీలకు ఉపాధి లభిస్తుందని, దాంతో చిన్నాచితక వ్యాపారస్తులకు ఉపాధి దొరుకుతుందని రైతులు అంటు న్నారు. అదే విధంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను సస్యశ్యామలం చేస్తున్న ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ప్రాజెక్టుల కాలువల ఆధునీకరణ పనులు ఏండ్లుగా పెండింగ్‌లో ఉంటున్నాయి. ప్రాజెక్టుల నుంచి నీళ్ల వదిలిన సమయంలో చివరి ఆయకట్టుకు నీరు అందక రైతులు పంటలను నష్టపోతున్నారు. దీంతో పాటు ప్యాకేజ్ 20,21,22 పనులపై రైతులు ఎదురుచూస్తున్నారు.

ప్రతిపాదనలకే స్మార్ట్‌సిటీ పరిమితం

నిజామాబాద్‌ను స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేస్తామని పరిశ్రమలు తీసుకొస్తామని హామీలు వస్తున్నా.. అందుకు తగ్గ కార్యచరణ మాత్రం రూపొందడం లేదనే విమర్శలు లేకపోలేదు. జిల్లా కేంద్రంలో ఉన్న బైపాస్ రోడ్లు.. నగరం నడిబొడ్డు నుండే వెళుండటంతో ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదు. భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. సిటీకి దూరంగా బైపాస్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సరైనా మాస్టర్ ప్లాన్ లేదు. 1974 జనాభా లెక్కల ప్రకారం వేసిన మాస్టర్ ప్లాన్ మాత్రమే ఉంది. అది రూపొందించి 40 సంవత్సరాలు పూర్తయినా.. ఇంకా ఇప్పుడున్న జనాభాకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ లేకపోవడం గమనార్హం. జిల్లా కేంద్రం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా అభివృద్ధి చెందుతే జిల్లా ప్రజల తోపాటు ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగుపడే అవకాశాలు ఉన్నాయని పలువురు రాజకీయ నిపుణులు అంటున్నారు. ఇప్పటికైనా మార్చి 19 నిర్వహించి బడ్జెట్లో నిజామాబాద్ జిల్లాకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని, రైతులకు, విద్యార్థు లకు, యువతకు, ఆదేవిధంగా వైద్య సేవలోను, వ్యాపారవేత్తలు కూడా ఉపయోగపడే విధమైన బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

క్రీడల్లో అంతర్జాతీయంగా రాణిస్తున్న.. సదుపాయాలు అంతంతే

క్రీడా పోటీల్లో జిల్లా నుంచి అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. నిఖత్ జరీన్ ప్రతిభను సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు ప్రస్తావించారు. అయితే క్రీడా రంగంలో రాణించేందుకు క్రీడాకారులు ఉన్నా.. సదుపాయాలు లేవు. గతంలో జిల్లాలో ఖలీల్‌వాడీ గ్రౌండ్ ఉండగా.. అక్కడ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించారు. అయితే అప్పటి నుంచి జిల్లాకు సరైనా క్రీడా ప్రాంగణం లేకుండా పోయింది. రాజారాం స్టేడియం ఉన్నా.. సదుపాయాలు ఏమీ లేవు. నిజామాబాద్ జిల్లా కేంద్రం నుంచి ఎందరో క్రీడాకారులు ఉన్నత శిఖరాలలో వెళ్తున్నప్పటికీ నిజాంబాద్ జిల్లా కేంద్రంలో ప్రత్యేకమైన క్రీడాస్థలాలు పట్టణ కేంద్రంగా లేకపోవడంతో క్రీడాకారులు రాణించలేకపోతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఇతర ప్రాంతాలకు వెళ్లలేక.. క్రీడల్లో రాణించలేకపోతున్నారు. ఈ విషయమై పలుమార్లు పలు క్రీడా సంఘాలు అధికారులకు సైతం వినతిపత్రాలు అందజేశాయి. ఇప్పటికైనా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా క్రీడాస్థలాన్ని ఏర్పాటు చేసి, క్రీడాకారులకు ప్రత్యేక బడ్జెట్ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు



తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో.. నిజామాబాద్‌కు ప్రత్యేకంగా తెలంగాణ యూనివర్సిటీకి వంద కోట్ల బడ్జెట్ కేటాయించాలి. అదేవిధంగా ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలి. నిజామాబాద్ జిల్లా వ్యవసాయానికి మారుపేరుగా ఉన్నందున అగ్రికల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి. బోధన్ చక్కెర కర్మాగారం, సారంగాపూర్ చక్కెర కర్మాగారం రైతులకు అందుబాటులోకి తెచ్చే విధంగా ప్రత్యేకంగా బడ్జెట్ ని కేటాయించాలి. అంతేకాకుండా పసుపు, ఎర్రజొన్నలకు ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, రైతులు పండించే పంటలకు నిజాంసాగర్, శ్రీ రామ్ సాగర్ ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టు వరకు నీటిని సౌకర్యం అందేలా కాలువలకు మరమ్మతు పనులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ఆధునిక కాలంలో 'ఏఐ' అవసరం

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-నిజాంసాగర్

ఆధునిక కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ ప్రతి ఒక్క విద్యార్థికి అవసరమని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మండలంలోని అచ్చంపేట ప్రాథమిక పాఠశాలలో కృత్రిమ మేధ ఆధారిత ఎఫ్ఎల్ఎన్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన తల్లిదండ్రులకు సమావేశంలో ఆయన మాట్లా డుతూ.. ఏఎక్స్ఎల్ ల్యాబ్ విద్యార్థులకు సులభంగా మౌలిక భాషా గణిత సామర్థ్యాలను సాధించడానికి ఉపయోగపడతాయని వెల్లడిం చారు. ప్రధానోపాధ్యాయులు తమకు వచ్చిన నిధులను పూర్తిస్థాయిలో పాఠశాల అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధిలో గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమని చెప్పారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టరు కిరణ్మయి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ వేణుగోపాల్, మండల విద్యాశాఖ అధికారులు తిరుపతి రెడ్డి, అమర్ సింగ్, ప్రధానోపాధ్యాయులు రామచందర్, అమ్మ ఆదర్శ పాఠశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో స్కూల్‌కు పూర్వవైభవం

- జిల్లా విద్యాధికారి రాజు



స్కూల్ మరమ్మతులకు ముందుకు వచ్చిన టీడీఎఫ్

నవతెలంగాణ-లింగంపేట్

దాతల సహకారంతో పాఠశాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని జిల్లా విద్యాధికారి రాజు అన్నారు. మండలంలోని పర్మళ్ల ప్రాథమిక పాఠశాల శిథిలావ్యవస్థకు చేరుకోవడంతో పాఠశాల పునర్నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చారు. శనివారం డీఈవోతో పాటు ప్రాథమిక పాఠశాలను తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం బృందం సభ్యులు సందర్శించారు. గదులు శిథిల వ్యవస్థ చేరుకోవడంతో పాత పాఠశాలల భవనాన్ని పైకప్పులు తీసేసి మళ్లీ గోడలు కట్టి రెండు తరగతి గదులు మార్చడానికి తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం బృందం సభ్యులు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి చాప్టర్ మెంబర్ డాక్టర్ వాణి జెయింట్ అండ్ ట్రెజరర్ సునీల్ కుమార్ పాఠశాల స్థితిగతులను విద్య వ్యవస్థను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం ఓ వేణు శర్మ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాములు, మండల విద్యాధికారి షౌకత్ అలీ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు వసుధ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ సిద్ధవ్వ, ఉపాధ్యాయులు విద్యా కమిటీ సభ్యులు తదితరులున్నారు.

ముందు ప్రజల జీవితాలను చదువుదాం

- పుస్తకాలను తర్వాత చదువుదాం
- ప్రముఖ కవి, రచయిత హెచ్ ఆర్‌కే
- గొర్రెపాటి మాధవరావు పుస్తక పరిచయ సభ





మాట్లాడుతున్న హెచ్ ఆర్‌కే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజల జీవితాలను ముందు చదువుదాం.. తర్వాత పుస్తకాలను చదువుదామని ప్రముఖ కవి, రచయిత హెచ్ ఆర్కే అన్నారు. శనివారం గొర్రెపాటి మాధవరావు పుస్తక పరిచయ సభను కోటగల్లి జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్టు (గ్రంథాలయం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సభను జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్టి, సీనియర్ న్యాయవాది వి. సంగం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ కవి, రచయిత హెచ్ ఆర్కే మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోలా చదువుతున్నప్పుడు ఎప్పుడు బయట ఉంటావు ఉద్యమంలో ఎప్పుడు లా పుస్తకాలు చదువుతావు అని మాధవరావు అడిగితే పుస్తకాలను ఎప్పుడైనా చదవొచ్చు కానీ.. ముందు ప్రజల జీవితాలను ముందు చదువుదామని అనేవారు అని, అంత గొప్ప మేధావి మాధవరావు అన్నారు. ఐక్యత ఘర్షణ లేనిది ఏ ఉద్యమం ఉండదని ఇద్దరం అనుకునే వాళ్ళమని, అదే వాస్తవమని, విప్లవ ఉద్యమంలో ఇవి లేకుండా సజీవంగా ఉండలేవు అన్నారు.

రష్యా ఉక్రెయిన్ రెండు దేశాల ఉద్యమం కాదు అది కేవలం అమెరికా చేయిస్తున్న ఉద్యమం అని, దాని ప్రయోజనాలు దానికి ఉన్నాయని అన్నారు. ప్రపంచంలో చాలా దేశాల్లో రెండు దేశాల మధ్య గొడవలు జరుగుతున్నాయి అంటే అది అమెరికా ఆధిపత్యం కోసం ఆ దేశం పై ఆధార పడటానికి, ఆ దేశాల్లో ఉన్న సహజ సంపద, చమురు, ఖనిజాలు దోచుకోవడానికి, ఆయుధాలు అమ్ముకోవడానికే అన్నారు. ఎలాన్ మాస్క్‌కు ట్రంప్ బానిస, ట్రంప్‌నకు మోడీ బానిస, మోడీకి చంద్రబాబు, రేవంత్‌రెడ్డి బానిస అని దాని కోసమే పని చేస్తారు కానీ ప్రజా ప్రయోజనాల కోసం కాదని అది అంత బూటకం అన్నారు.

మరో అతిథి శాతవాహన యునివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వినాయక రెడ్డి మాట్లాడుతూ విధానాల పరంగా అభిప్రాయాలు చెప్పడంలో మాధవ రావు నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా మాట్లాడేవారని అన్నారు. హక్కుల రంగంలో తనది చెరగని ముద్ర వేసుకున్నరని గుర్తు చేశారు. ఈ సభలో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్టి ఆకుల పాపయ్య, తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పిట్ల సరిత లు ప్రసంగించారు. కార్యక్రమంలో కృష్ణా గోపాల రావు, వి సంగం, వి భాస్కర్, పరుచూరి శ్రీధర్ , నీలం సాయి బాబా, ఎల్ బి రవి, ఎం శివ, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంగులు, రమేష్, ఆకుల అరుణ, వి భూమయ్య దాసు, రాజేశ్వర్ , గొర్రెపాటి మాధవ రావు జీవిత సహచరి మీనా సహని, కూతురు మధుమిత తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు పకడ్బందీగా చేపట్టాలి

- తూకంలో మోసం చేస్తే కఠినంగా వ్యవహరించాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరామ్ నాయక్



మాట్లాడుతున్న మోతీరామ్‌నాయక్

నవతెలంగాణ-కామారెడ్డి

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలనీ, తూకంలో మోసం చేస్తే కఠినంగా వ్యవహరించాలనీ తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతి రామ్ నాయక్ అన్నారు. కామారెడ్డి జిల్లా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇంకా పది రోజుల్లో వరి కొనుగోలు ప్రారంభమవుతున్నాయని, గతంలో క్వింటాలకు నాలుగు నుంచి ఐదు కిలోల వరకు తూకంలో తరుగు పేరిట రైతులకు మోసం చేశారని అన్నారు. ప్రభుత్వాధికారులు రైస్ మిల్లర్లు కలిసి రైతులకు నిండా ముంచారని విమర్శించారు. ఈ సీజన్లో అలాగే కొనసాగితే రైతు సంఘం చూస్తూ ఊరుకోదని ప్రతి రైతు సంఘం కార్యకర్తలు కల్లాలను సందర్శించనున్నట్టు తెలిపారు. ఎక్కడైనా తూకంలో మోసం జరిగితే వెంటనే ఎండగట్టాలన్నారు. ఆయా మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల ముందు ధర్నాకు దిగాలని సూచిం చారు. సోమవారం జిల్లా కలెక్టర్లను కూడా వినతి పత్రం ఇస్తామని అన్నారు. ఎక్కడికి అక్కడ రైతు సంఘం కార్యకర్తలు రైతుల వెంటబెట్టుకొని రైతులకు మోసం జరగకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఉప్పల సాయిలు, సంజీవ్, కిషన్ నాయక్ వసంతరావు, దశరథం తదితరులు పాల్గొన్నారు.

17, 18న అంగన్‌వాడీ సమ్మె

- విజయవంతం చేయండి : యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు రమేశ్‌బాబు



మాట్లాడుతున్న రమేశ్‌బాబు

నవతెలంగాణ-నవీపేట్

ఈనెల 17, 18 తేదీలలో అంగన్వాడి సమస్యలపై జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు రమేష్ బాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో అంగన్వాడీలతో శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం 65 సంవత్సరాలు నిండిన అంగన్వాడీలను రిటైర్మెంట్ చేసినప్పటికీ నిధుల లేమి పేరుతో ఇప్పటికీ బెనిఫిట్స్ రాలేదని వెంటనే అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రానున్న కేంద్ర బడ్జెట్లో ఐసిడిఎస్ శాఖకు సరిపడ నిధులు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాయక్ వాడి శ్రీనివాస్, డిచ్ పల్లి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు శివ రాజమ్మ అంగన్వాడీలు సుజాత, మాధవి, శృతిమా, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన షబ్బీర్‌అలీ

అనారోగ్యంతో అప్పుల పాలైన వారికి సీఎంఆర్‌ఎఫ్ అండ

- చెక్కుల పంపిణీలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ)24 చెక్కులను దాదాపు 20 లక్షల రూపాయలు లబ్దిదారులకు శనివారం పంపిణి చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ కామారెడ్డి నియోజకవర్గంలో దాదాపు 24 మందికి సీఎం సహాయ నిధి నుండి నిధులు మంజూరు చేయించినట్టు తెలిపారు. అనారోగ్యంతో అప్పుల పాలైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో కొంత ఉపశమనం కలిగిస్తాయి అన్నారు. పేదలకు సహాయంగా అండగా నియోజకవర్గ ప్రజల మంచి మాత్రమే కోరుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు అర్హులకు అందిస్తాం అని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఎక్కువగానే అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలా శ్రీనివాసరావు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, గ్రంథాలయం మాజీ చైర్మన్ పున్న రాజేశ్వర్, పండ్ల రాజు, పంపరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా భరోసా కేంద్రం

- తక్షణమే బాధితులకు సూచనలు, సలహాలు, సహాయం అందించాలి
- 'భరోసా' కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పి రాజేశ్‌చంద్ర



మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

నవతెలంగాణ-కామారెడ్డి

లైంగికదాడికి గురైన బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటి నుంచి కేసు ట్రయల్‌కు వచ్చే వరకూ, పరిహారం ఇప్పించేవరకూ భరోసా సెంటర్ అండగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర అన్నారు. శనివారం అడ్లూర్ రోడ్డులో గల గ్రీన్ హెూమ్‌లో గల భవనంలో వున్న భరోసా సెంటర్‌ను జిల్లా ఎస్పి సందర్శించారు. పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కేసుల్లోని బాధిత మహిళలను అక్కున చేర్చుకుని వారికి వైద్యుడు, సైకాలజిస్టు, పోలీసులు సహాయం చేయడం, ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించడం వంటి సేవలతో బాధితులకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో 'భరోసా' కేంద్రం పని చేస్తుందని అన్నారు. బాధితులు రాగానే సత్వర న్యాయానికి కృషి చేస్తారని పెర్కొన్నారు. లైంగిక దాడులకు గురైనా బాధితులకు భరోసా కల్పించడంతో పాటు వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఎక్కడైనా పోక్సో, లైంగికదాడుల కేసులు నమోదు కాగానే బాధితులను నేరుగా భరోసా సెంటరుకు తీసుకొస్తున్నామన్నారు. తక్షణమే బాధితులకు సూచనలు, సలహాలు అందించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశిస్తున్నామని పేర్కొన్నారు. బాధితులకు న్యాయపరమైన సూచనలు అందించి, వారికి ఎవరూ లేనప్పుడు భరోసా సెంటర్ లో ఆశ్రయం కల్పించాలన్నారు. వీటితో పాటు ఈ భరోసా సెంటర్లు బాధితులకు నైపుణ్యాలను నేర్పించి, వారిని సమాజంలో ఉన్నతంగా జీవించేలా దోహదపడుతుందన్నారు. అందుబాటులో వున్న లీగల్, మెడికల్, చిన్నారుల కౌన్సెలింగ్ గదులు, స్టేట్మెంట్ రికార్డు సమావేశ గదులను పరిశీలించిన ఎస్పి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పి కె. నరసింహ రెడ్డి , జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ తిరుపయ్య, భరోసా సెంటర్ యస్ఐ జ్యోతి, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యం.. బంధాలు బలోపేతం

నవతెలంగాణ-రామారెడ్డి

ఆటలతో ఆరోగ్యంతో పాటు సంబంధాలు మెరుగుపడతాయని ఎస్సై నరేష్ అన్నారు. మండలంలోని స్కూల్ తాండ గ్రామపంచాయతీ పరిధిలో ఎస్ ఎస్ పి ఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఐదు రోజుల నుండి ఆరు టీములతో నిర్వహించారు. శనివారం చివరి రోజు సలావత్ సురేష్ టీం విన్నర్‌గా నిలవగా జగదాంబ రైడర్ రన్నరప్‌గా ఎస్ఐ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సలావత్ బుచ్చిరెడ్డి, జగదాంబ తాండ మాజీ సర్పంచ్ రాజు నాయక్, టోర్నమెంట్కు సహకరించిన బాలు నాయక్, సలావత్ నంద, రాజేందర్, ప్రకాష్ సలావత్, భూక్యానంద, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సాటాపూర్ రామ మందిరానికి విరాళాల అందజేత

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ గ్రామానికి చెందిన అమ్రాజ్ శేఖర్ సాటపూర్ రామ మందిరానికి రూ.10,100 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారికి సాటాపూర్ గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నితిన్, కుర్మే సాయిలు, సంతోష్, కోసం పెద్ద సాయిలు తదితరులు పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న గ్రామస్తులు

ఎమ్మార్పీఎస్ నిరసనకు సంఘీభావం

నవతెలంగాణ-రెంజల్

ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు అయ్యేంతవరకు ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలను నిలిపివేయాలని కోరుతూ చేపట్టిన నిరాహార దీక్ష శనివారం నాటికి ఆరవ రోజుకు చేరుకుంది. శనివారం బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ తెలంగాణ శంకర్ ఎమ్మార్పీఎస్ నిరాహార దీక్ష చేస్తున్న వారికి సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బండారి పోశెట్టి, మండల అధ్యక్షులు కిన్నెర మోహన్, పి.సంజు, బండారి సాయిలు, అశోక్, పోశెట్టి, భూమన్న, సాయిలు, చిన్న గంగారం, ఎల్లయ్య, దాసు తదితరులు పాల్గొన్నారు.


నిరాహార దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కేసుల చార్జీషీట్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సాంబశివరెడ్డి ఆదేశాల మేరకు శనివారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.లక్ష్మీనర్సయ్య నిజామాబాద్/కామారెడ్డి జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో కొత్త చట్టాల ద్వారా నేడు లోక్ అదాలత్ కేసుల లొసుగుల గురించి విపులంగా తెలియజేశారు. ఈ సమావేశంలో నూతన చట్టాల ద్వారా నేరపరిశోధన, చార్జిషీట్ దాఖలు చేసే విధానం గురించి సాక్షుల వివరాలు సేకరించే విధానాన్ని డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య క్లుప్తంగా వివరించారు. ప్రతి కేసులో ముద్దాయిలకు శిక్ష పడేవిధంగా చూడాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పీసు రాజేశ్వర్‌రెడ్డి, రాజగోపాల్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, కావేటి శేషు, బంటు వసంత్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జి.రామకృష్ణ, భూసారపు రాజేష్‌గౌడ్, అశోక్, శివరాంనాయక్, చిదిరాల రాణి తదితరులు పాల్గొన్నారు.

సీపీ సాయి చైతన్యను కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా నూతన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సాయి చైతన్యను నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నిజామాబాదు జిల్లాలో లా అండ్ ఆర్డర్ అదుపు చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా జరుగుతున్న డ్రగ్స్, గంజాయి, మాదకద్ర వ్యాలపైన ఉక్కుపాదం మోపి యువతను వాటి బారిన పడకుండా రక్షించాలని అన్నారు. మాదకద్రవ్యాలపైన పోలీస్ శాఖ వారు కళాశాల విద్యార్థుల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నగరంలో వరుస దొంగతనాలు చైన్ స్నాచింగ్, ఆటో, బైక్ దొంగతనాలు అరికట్టి ప్రజలకు రక్షణగా నిలవాలన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య, ఫుట్ పాత్ కబ్జాలు, అక్రమ భూ కబ్జాలపై ప్రతేక దృష్టి పెట్టాలని కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుని సామాన్య ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. జిల్లా అభివృద్ధి, లా అండ్ ఆర్డర్ కాపాడటంలో పోలీస్ శాఖ వారు తీసుకునే ప్రతి అంశంలో ఎమ్మెల్యేగా తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు.


సీపీని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే

జీజీ కళాశాలలో ప్రదర్శన కళలపై కార్యశాల


బ్రోచర్‌లను విడుదల చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలోని కొరవి గోపరాజు తెలుగు విభాగం ఆధ్వర్యంలో మార్చి 26వ తేదీన 'తెలుగు సాహిత్యం-ప్రదర్శన కళలు' అనే అంశంపై నిర్వహించే ఒక రోజు కార్యశాల బ్రోచర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.రామ్ మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.రంగరత్నంతో కలిసి శనివారం ఆవిష్కరించారు. తృతీయ సంవత్సరం విద్యార్థుల సిలబస్‌కు అనుబంధంగా ఈ కార్యాశాలను రూపొందించినట్టు తెలిపారు. ప్రముఖ వ్యాఖ్యాత వి.పి.చందన్‌రావు, రంగస్థలం కళాకారుడు శ్రీనివాసరెడ్డి ప్రధాన వక్తలుగా హాజరవుతున్నారని కార్యశాల సమన్వయ కర్త, తెలుగు విభాగం అధిపతి లెఫ్టినెంట్ డా.ఎం.రామస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.క్యూ. ఏ.సి. కో-ఆర్డినేటర్ రాజేష్, పి.ఆర్.ఓ. దండు స్వామి, పరీక్షల నియంత్రణ అధికారి భారత్ రాజ్, వినయ్ కుమార్, పి.డి. బాలమణి, తెలుగు అధ్యాపకులు రాజేశ్వర్, రాధిక, గంగాధర్, అర్చన, సవిత, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి అదృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే పోలీస్ స్టేషన్ నుంచి ఓ బాలిక (చిన్నారి) అదృశ్యమైనట్లు నిజామాబాద్ ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రఘుపతి శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఈనెల 14 తేదీన చిన్నారి రైల్వేస్టేషన్ నుంచి తప్పిపోయింది. ఎవరికైనా కనిపిస్తే నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయిరెడ్డి, లేదా నిజామాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రఘుపతికి లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని తెలియజేశారు.



స్థానిక సంస్థల ఎన్నికలలో వికలాంగులను నామినేట్ చేయాలి

- అందుకు ప్రత్యేక చట్టం చేయాలి
- ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

నవతెలంగాణ-బోధన్

స్థానిక సంస్థల ఎన్నికలలో వికలాంగులకు నామినేట్ చేసేందుకు ప్రత్యేక చట్టం చేయాలని ఎన్పీఆర్డీ డిమాండ్ చేసింది. శనివారం బోధన్ మండలంలోని బర్దిపూర్, లంగ్డాపూర్ గ్రామాలలో ఎన్పిఆర్డీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు గోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలలో వికలాంగులకు నామినేట్ చేయాలని డిమాండ్ చేశారు. ఒక మహిళ, ఒక పురుషుడిని నామినేట్ చేయడానికి వీలుగా ప్రత్యేక చట్టం చేయాలని కోరారు. రాష్ట్ర జనాభాలో 12 శాతం గ్రామపంచాయతీలలో 2538 మంది సభ్యులకు, మున్సిపాలిటీలలో 260 మంది సభ్యులకు, కార్పొరేషన్‌లో 26 మందికి, మండల పరిషత్‌లలో 1080 మందికి, జిల్లా పరిషత్‌లో 64 మందికి రాజకీయ అవకాశాలు వస్తాయని.. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థికభారం లేకుండా రాష్ట్రవ్యాప్తంగా 26,968 మంది నామినేట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గంగాధర్, సుంకర పోశెట్టి, బోయ లచ్చయ్య, దాసరి వాసు, సాయిలు, లక్ష్మి, నరేందర్, రాములు, ఎల్లయ్య, నాగయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


సంతకాలను సేకరిస్తున్న నాయకులు

దళితులను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయొద్దు

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-నవీపేట్/రెంజల్/బోధన్

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో దళితులను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడం సరికాదని బిఆర్ఎస్ జిల్లా నాయకులు తెడ్డు పోశెట్టి అన్నారు. మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి సస్పెన్షన్‌కు నిరసనగా రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా తెడ్డు పోశెట్టి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం స్పీకర్ దళితుడు అనే పేరుతో ఎమ్మెల్యేపై సస్పెన్షన్ చేయడం సరికాదని అన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు రైతుల సమస్యలపై ప్రశ్నించగా సమాధానం చెప్పలేక ఇలా ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను సస్పెన్షన్ చేయడం అప్రజాస్వామికమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాలతో క్షేత్రస్థాయిలో రైతులు, నిరుద్యోగులు, పేదప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. తీరు మార్చుకోకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని సొసైటీ చైర్మన్ న్యాలకంటి అబ్బన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు, లోకం నర్సయ్య, అల్లం రమేష్, కరిపే మల్లేష్, తాహిర్‌బిన్ జాఫర్, గైని సతీష్, రాములు, స్వామి, శ్యామ్, అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం..

రెంజల్ : ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడడంతో ఆయనను సస్పెండ్ చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకుడు రాఘవేందర్ మాట్లాడుతూ.. 6 గ్యారంటీ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వ పనితీరుపై ప్రజలు గమనిస్తూ ఉన్నారని ఆయన అన్నారు. ప్రజల పక్షాన నిలబడ్డ వారిని సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గౌరాజి రాఘవేందర్, తెలంగాణ శంకర్, ఫిరోజ్ ఉద్దీన్, తిరుపతి రాము, ప్రవీణ్, భూమేష్, గఫ్ఫార్ బేగ్, రాఘవాచారి, ముఖిద్, రాందాస్, పిల్లల ప్రవీణ్, దౌలత్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీఆర్ఎస్ నాయకులు బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన చేపట్టి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అనంతరం పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై గొంతెత్తుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే సభ నుంచి బహిష్కరిస్తారా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రజా సమస్యలను శాసనసభలో కూడా లేవనెత్తనివ్వరా అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఇంత అసహనం పనికిరాదన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా ప్రజల దష్టి మళ్లించడానికే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేశారని విమర్శించారు. తక్షణమే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నక్క లింగారెడ్డి, రవిశంకర్ గౌడ్, శంకర్ గౌడ్, ప్రవీణ్ నాయక్, అహమ్మద్, సాగర్, నసీర్ పటేల్, సాయిలు, ఇంతియాజ్ పటేల్, సుధాకర్, ఆసీమ్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.


నవీపేట్: సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


రెంజల్‌లో


బోధన్‌లో..

తెలంగాణ యూనివర్సిటీకి ఈశ్వరీబాయి పేరు పెట్టాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ విశ్వవిద్యాలయానికి తెలంగాణ పోరాట యోధురాలు జె.ఈశ్వరీబాయి పేరు పెట్టి "ఈశ్వరీ బాయి తెలంగాణ విశ్వవిద్యాలయం"గా మార్చాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలు డిమాండ్ చేశారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర అధ్యక్షుడు అంగిరి ప్రదీప్ అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఉద్యోగ సంఘాల నాయకులు, అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్, పూలే-అంబేద్కర్ యూత్ అసోసియేషన్ నాయకులు పాల్గొని ప్రసంగించారు. సభాధ్యక్షులు, వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. "తెలంగాణ తొలిదశ ఉద్యమకారురాలు జె.ఈశ్వరీ బాయి గొప్పతనాన్ని గుర్తించి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ విశ్వవిద్యాలయానికి ఈశ్వరీ బాయి పేరు పెట్టాలనే ప్రతిపాదన తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం కాన్షీరాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీకి ఈశ్వరి బాయి పేరును తెలంగాణ యూనివర్సిటీకి పెట్టేటట్టు రాష్ట్ర ప్రభుత్వ, గౌరవ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అలుక కిషన్, మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు గంట సదానందం, సీనియర్ దళిత నాయకులు సిద్ది రాములు, మాదిగ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొక్కెర భూమన్న, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు చిట్టెటి మోహన్ రావు, టీమ్ జిల్లా అధ్యక్షులు సక్కి ఉదయ్, సమత వాలంటరీ ఫోర్స్ అధ్యక్షుడు గొరికంటి లింగన్న, డిక్కీ జిల్లా అధ్యక్షులు సీహెచ్.వెంకట రమణ, తెలంగాణ మాల మహానాడు యూత్ అధ్యక్షుడు కిరణ్ అనుపాల్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఇత్వర్‌పేట్ లింగన్న, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు అజయ్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్గుల్ సురేష్, ఎస్సి, ఎస్టీ విద్యార్థి సంఘం తర్ల లక్ష్మణ్, గోలెం అరుణ్, అచ్యుత్, రవి, రాము తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న అంసా నాయకులు

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం

- కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని హాసకొత్తూర్ గ్రామ అభివృద్ధి కమిటీ హాల్లో సీసీ కెమెరా, సైబర్ క్రైమ్స్, దొంగతనాల గురించి అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో, వ్యాపార సముదాయాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు ఎంతో ముఖ్యమన్నారు. ఏదైనా ఘటన జరిగితే నిందితులను గుర్తించేందుకు సిసి కెమెరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. సీసీ కెమెరాల సహాయంతో ఎంతోమంది నిందితులను పట్టుకున్న ఘటనలు ఉన్నాయన్నారు. ఆన్లైన్ మోసాల పట్ల కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి మోసపోవద్దన్నారు. సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేసేందుకు కాచుకూచున్నారని, ప్రజలు కూడా తెలివిగా వ్యవహరించి ఎవరికీ కూడా ఎలాంటి ఓటిపిలు చెప్పొద్దన్నారు. గ్రామస్తులు ఎవరైనా ఎక్కువ రోజులు ఇంటికి తాళం వేసి ఊర్లకు వెళితే పక్కింటి వారికి, పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లాలన్నారు. అనంతరం ఎస్ఐ అనిల్‌రెడ్డిని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసయ్య, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు ధర్పల్లి సతీష్, కార్యదర్శి గడ్డం వినోద్, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ

ఏర్గట్లలో ఈ నెల 20న తైబజార్ వేలం

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల గ్రామపంచాయతీ ఆవరణలో ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు తైబజార్ వేలం ఉంటుందని గ్రామ పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునేవారు మేకల సంతకు రూ.10వేలు, కూరగాయల మార్కెట్‌కు రూ.10వేలు వేరువేరుగా డిపాజిట్ రూపంలో చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

పాఠశాలలో మరుగుదొడ్డి నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్మూర్ రోటరీ ఆధ్వర్యంలో టాయిలెట్ బ్లాక్ ప్రారంభం కోసం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జక్రాన్‌పల్లి మండల విద్యాధికారి మూడేళ్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్మూర్ రోటరీ అధ్యక్షులు రాజనీష్ కిరాడ్ టాయిలెట్ బ్లాక్ ప్రారంభ భూమి పూజ నిర్వహించి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. టాయిలెట్ బ్లాక్ ప్రాజెక్టు ఖర్చు విలువ సుమారు రూ.10 నుంచి 12 లక్షల వరకు అవుతుందని తెలిపారు. 80 శాతం ఆర్‌సి లేక మోయినాబాద్ సిఎస్ఆర్ ఫండ్స్ రోటరీ ఆధ్వర్యంలో 20శాతం లింగన్నగారి మంజిత్‌రెడ్డి, బ్రదర్స్ ఎం వెంకటరాం రెడ్డి (భాయ్ సాబ్) గారి జ్ఞాపకార్థం నిధులు అందజేస్తున్నట్టు తెలిపారు.

గ్రూప్ 1లో ఉత్తమ ర్యాంకు సాధించిన ఉపాధ్యాయుడికి ఘన సన్మానం


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

గ్రూప్ 1 పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించిన రెంజల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వినోద్ కుమార్‌ను మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు ఆధ్వర్యంలో పిఆర్‌టియు మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా మాజీ అధ్యక్షులు ఈ.శంకర్, పిఆర్‌టియు మండల అధ్యక్ష కార్యదర్శులు టి.సోమలింగంగౌడ్, కిషోర్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్, అబ్దుల్ కరీం, ఫెరోజ హైమద్, హర్షియా నాజం, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, స్వప్న, శంకర్, పాల్గొన్నారు.

స్కిల్ ఆఫ్ గ్రాడేషన్ శిక్షణ అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సి కన్వెన్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం హైద్రాబాద్ న్యాక్ సంస్థ వారి "స్కిల్డ్ అప్ గ్రాడేషన్ సర్టిఫికెట్" కార్యక్రమానికి హాజరైన అభ్యర్థులకు వారి వృత్తి నైపుణ్యంపై శిక్షణనిచ్చి సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎసి వారి సౌజన్యంతో ప్రాచాత్య దేశాలలో పని చేయుటకు అనుభవం కలిగిన భవన నిర్మాణం నైపుణ్య స్కిల్డ్ వర్కర్స్‌కు న్యాక్ సంస్థ వారి "స్కిల్డ్ అప్ గ్రాడేషన్ సర్టిఫికెట్ " శిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలూర్ మండల ప్రెసిడెంట్ ముక్కెర విజయ్, మాజీ మున్సిపల్ చైర్మన్ పవన్ పండిట్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు భారత జట్టులో జిల్లా క్రీడాకారులు


విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్

నవతెలంగాణ-ఆర్మూర్

ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 31 వరకు పులి, నాన్‌టౌవ్, తైవాన్ దేశంలో జరగనున్న సబ్-జూనియర్ (అండర్-15) ఏషియన్ మహిళల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు భారత జట్టులో జిల్లా క్రీడాకారులు నిశిత, వర్షిని, కీర్తన (సాంఘిక సంక్షేమ పాఠశాల సుద్ధపల్లి), సౌజన్య (సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల ఆర్మూర్) ఎంపికైనట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ శనివారం తెలిపారు. నవంబర్ 23 నుంచి 24 వరకు ఛత్రపతి శివాజీ జిల్లా క్రీడా స్టేడియం జల్గావ్ మహారాష్ట్రలో జరిగిన మొదటి సెలక్షన్ ట్రయల్స్ శిక్షణ శిబిరంలో పాల్గొని భారత ప్రబబుల్స్ జట్టుకు ఎంపికై, జనవరి 18 నుండి 24 వరకు ఇండోర్ మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన రెండవ సెలక్షన్ ట్రయల్స్ శిక్షణ శిబిరంలో పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచి భారత జట్టుకు ఎంపికై ఈనెల 15 నుండి 20 వరకు న్యూఢిల్లీలో జరిగే మూడవ శిక్షణ శిబిరంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి చిప్ప నవీన్, జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ తదితరులు అభినందించారు.

18న బిచ్కుంద తైబజార్ వేలం

నవతెలంగాణ-బిచ్కుంద

2025- 26 సంవత్సరానికి గాను బిచ్కుంద గ్రామపంచాయతీ తైబజార్ వేలం ఈ నెల 18 మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తైబజార్ వేలంలో పాల్గొను వారు రెండు లక్షల రూపాయలు డిపాజిట్ చెల్లించాలని గ్రామపంచాయతీ తైబజార్ సంబంధించి గతం బకాయిలు, ఇంటి పన్ను సంబంధిత ఎలాంటి పన్నులు గ్రామపంచాయతీకి బాకీ ఉండరాదని, వేలంలో కనీస ధర రాణి ఎడల తిరిగి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాట పాడి వేలం పొందిన వ్యక్తులు 24 గంటల్లో సగం డబ్బులు గ్రామపంచాయతీ కార్యాలయంలో చెల్లించాలని మిగతా డబ్బులు 9 కిస్తులలో చెల్లించేందుకు వెసులుబాటు ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్యదర్శి కోరారు.

పరీక్ష అట్టలు అందజేత

నవతెలంగాణ-భిక్కనూర్



మండలంలోని కాచాపూర్ గ్రామంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు వితరణ చేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఫౌండేషన్ సభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు సంపత్, శ్రీధర్, రాజు, శ్రీకాంత్, చంద్ర శేఖర్, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

నమూనా నిర్మాణం పూర్తిచేయాలి

- ఇందిరమ్మ ఇండ్లపై కలెక్టర్ సూచన
- ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశం



ఇండ్ల నమూనాను పరిశీలిస్తున్న కలెక్టర్



విద్యార్థులతో భోజనం చేస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-పిట్లం

ఇందిరమ్మ ఇండ్ల నమూనా భవన నిర్మాణం సత్వరమే పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ హౌసింగ్ పీడీ విజయ్‌పాల్‌ను, డిప్యూటీ ఈఈ గోపాల్‌ను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇండ్ల నమూనా భవనం , గ్రామపంచాయతీ కార్యాలయం , జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల , పాఠశాల ఆవరణలోని ఏడవ అంగన్వాడి సెంటర్ ను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమునకు గాను మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన ఇందిరమ్మ నమూనా భవనమును పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ ప్లాట్ల క్రమబద్ధీకరణ ఎంతవరకు వచ్చిందని పంచాయతీ సెక్రెటరీ బలరామును అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ పరిధిలో 1364 ప్లాట్లు క్రమబద్ధీకరణకు అవకాశముండగా 9 మాత్రమే పూర్తయినట్టు సమాధానమిచ్చారు. స్పందించిన కలెక్టర్ ప్రభుత్వ పరంగా ఫేజులో 25 శాతం మినహాయింపు ఇవ్వ నునందున సత్వరమే పూర్తిచేయాలని ఆదేశించారు. సీసీ రోడ్ల పనుల పురోగతి పై ఎంపీడీవో కమలాకర్‌ను ప్రశ్నించడంతో ఆయన 7 సీసీ రోడ్లు మంజూరు కాగా 5 సిసి రోడ్లు పూర్తికాగా మిగిలిన 2 సిసి రోడ్లను నెలాఖరు వరకు పూర్తి చేస్తామని సమాధానమిచ్చారు. కాగా అంగన్వాడి సెంటర్ పరిశీలనలో భాగంగా కలెక్టర్ , అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి పిల్లలతో ముచ్చటించారు. అలాగే బెన్ ఫిషర్ తల్లిదండ్రుల తో మాట్లాడి వాళ్ల పిల్లలకి అందుతున్న పౌష్టికాహారం గురించి ఆరా తీశారు. పిల్లలు బలంగా తయారవ్వాలంటే అంగన్వాడీలో ఇస్తున్న పౌష్టికాహారాన్ని తల్లిదండ్రులు అంగన్వాడి సెంటర్‌కి వచ్చి తీసుకెళ్లాలని సూచించారు. మ్యామ్ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి ఎన్ఆర్‌సికి వెళ్లాల్సిందిగా తెలిపి వారికి కావలసిన సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. కాగా విద్యార్థుల తో మమేకమై వారి ఆటపాటలను తిలకించారు.

ప్రశాంతంగా పరీక్షలకు సన్నద్ధం కావాలి..

మండల కేంద్రం పర్యటనలో భాగంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి చర్చించి పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ప్రశాంతంగా ఉండి ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా, భయపడకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఆంగ్ల పరిజ్ఞానాన్ని ఆయన పరిశీలించి ఐఎఫ్ పి ప్యానల్ పై వివాహాల అనర్థాలు అన్న అంశముపై పోస్టర్ ను తయారు చేయించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వామన్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా విద్యా శాఖ సమన్వయకర్త వేణుగోపాల్ శ్రీ, శిశు సంక్షేమ, వయోవృద్ధుల ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల, బాన్సువాడ సిడిపిఓ సౌభాగ్యవతి, ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఈఓ దేవి సింగ్ , పంచాయతీరాజ్ డిప్యూటీ ప్రభాకర్, ఏ ఈ .మొగులయ్య, ఉపాధి హామీ ఏపిఓ మహేష్, పంచాయతీ సెక్రెటరీ బలరాం తదితరులు పాల్గొన్నారు.

మండల సమైక్య నూతన కార్యవర్గం ఏర్పాటు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మండల సమాఖ్య జనరల్ బాడీ సమావేశాన్ని మండల సమైక్య అధ్యక్షురాలు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమనికి అడిషనల్ డిఆర్డిఓ మురళి హాజరై సమావేశంలో మహిళా శక్తి కార్యక్రమాలపై గ్రామ, మండల సమైక్య ఎన్నికల విధానం కార్యక్రమము గుర్చి వివరించారు. మండల సమైక్య జనరల్ బాడీ సమావేశంలో నూతన ఇసీ సభ్యులను, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా, జి. గోదావరి, కార్యదర్శిగా, ఎస్, పూజ, కోశాధికారిగా ఎన్. సరస్వతి తదితరులను ఎన్నుకున్నారు.

ఈ సమావేశానికి ఎన్నికల స్పెషల్ అధికారిగా సదాశివనగర్ ఏపియం రాజారెడ్డి హాజరై ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపియం మొయిజ్, సీసీలు విశ్వనాథం అంజా గౌడ్, సంజీవ్, అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్, గ్రామ సంఘలో అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 4లో ఉద్యోగం సాధించిన వికలాంగురాలికి సన్మానం



ముక్తాబాయిని సన్మానించిన ఎంపీడీవో, సిబ్బంది

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండలంలోని మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన ముక్తాబాయి అనే మహిళ 100 శాతం వికలాంగురాలు. కాగా గ్రూప్ 4లో ఇటీవల జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీడీవో శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మారుమూల గ్రామం జుక్కల్‌లోని మహ్మదాబాద్ గ్రామపంచాయతీ గ్రామానికి చెందిన ముక్తాబాయి పేద కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయి అని, పుట్టుకతో ఆమె వికలాంగురాలు అని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని ముప్కాల్ మండలం కంచర్ల గ్రామంలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాల యందు జూనియర్ అసిస్టెంట్‌గా నేడు పదవి బాధ్యతలు చేపట్టనున్నట్టు తెలిపారు. కాగా శనివారం జుక్కల్ ఎంపిడిఓ కార్యాలయానికి రాగా ఆమెను సన్మానించారు. అదే విధంగా తనకు ప్రభుత్వం ఇస్తున్న వికలాంగురాలు పెన్షన్ రద్దు చేయాలని ప్రభుత్వ ఉద్యోగం వచ్చినందుకు పెన్షన్ రద్దు చేయాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తో పాటు సిబ్బంది గంగాధర్, సీనియర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్లీడర్‌గా షబానా బేగం

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వం తరపున కామారెడ్డి జిల్లా కోర్టులో కేసులను వాదించేందుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లను శనివారం నియమించింది. ఈ మేరకు నియామకమైన కామారెడ్డి జిల్లా జూనియర్ సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ షబానా బేగం మర్యాదపూర్వకంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌ని కలిశారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- బాయ్స్, గర్ల్స్ హాస్టల్స్ సందర్శించిన సబ్ కలెక్టర్ కిరణ్మయి



బాయ్స్ హాస్టల్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

నవతెలంగాణ-మద్నూర్

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆదేశించారు. మండల కేంద్రంలోని బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్‌ను శనివారం సందర్శించారు హాస్టల్లో విద్యార్థిని విద్యార్థులకు వసతులు పరిశీలించారు. ప్రభుత్వం అందించే మెనూ ప్రకారం భోజనాలు అందించాలని బాలికల, బాలుర, హాస్టల్ వార్డెన్లకు ఆదేశించారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని హాస్టల్ పిల్లలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వార్డెన్లను కోరారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ ఎండి ముజీబ్ హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించండి సారూ..

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రానికి చెందిన కటికే విట్టాబాయ్ తన కొడుకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.6లక్షల అప్పు చేశాడని, వాటిని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తనకు ఇప్పించాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని కోరింది. జిల్లా కేంద్రంలోని భారత్ రోడ్ చిన్న కసబ్ గల్లికి చెందిన తాము తమ కుమారుడైన అరె కటిక ఎకే.గోపాల్ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. అనారోగ్యంతో కొన్ని సంవత్సరాలుగా మంచంకే పరిమితం అయ్యాడని, గోపాల్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.6లక్షలు అప్పు చేశానని, ఆసుపత్రి బిల్లులు తీసుకొచ్చి సీఎం రిలీఫ్ ఫండ్ పెట్టిన సంవత్సరాలు గడుస్తున్న ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తాను రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అసలే మాది పేద కుటుంబం, ప్రస్తుతం తాను అప్పు తీర్చే పరిస్థితిలో లేనని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ కుటుంబని ఆదుకోవాలని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులను కోరుతుంది.

ఎస్పీకి సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాకు ఎస్పీగా బదిలీపై వచ్చిన రాజేష్ చంద్రను లంబాడా హక్కుల పోరాట సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నునావత్ గణేష్ నాయక్ సభ్యులతో కలిసి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పూల మొక్కను ఎస్పీకి అందజేశారు. ఎస్పీని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు రాణా ప్రతాప్ రాథోడ్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు వినోద్ చౌహాన్, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, మాచారెడ్డి మండల అధ్యక్షులు శంకర్ నాయక్, తదితరులు ఉన్నారు.

ఫైనాన్షియర్ వేధింపులతో.. గుండెపోటుతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-రామారెడ్డి



చిదుర విట్టల్ (ఫైల్)

ఫైనాన్షియర్ వేధింపులు తాళలేక తీవ్ర మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి గుండెపోటు తో మృతిచెందిన ఘటన మండలంలోని మద్దికుంట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మద్దికుంట గ్రామానికి చెందిన చిదుర విట్టల్ పేదరికంలో ఉంటూ కష్టపడి ఇల్లు నిర్మించుకోగా, ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి ఓ ప్రైవేట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలో ఆయన భార్య నాగరాణి భార్య పేరు మీద గల ఇంటిపై హౌసింగ్ లోన్ తీసుకున్నాడు. కొన్ని రోజులు సజావుగా చెల్లిస్తూ వచ్చారు. కాగా అనారోగ్య సమస్యల బారీన పడటంతో కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో హోమ్ లోన్ కిస్తీలు చెల్లించలేకపోయాడు. దీంతో హౌసింగ్ లోన్ కంపెనీ వారు, పెండింగ్ ఇన్‌స్టాల్‌మెంట్ కోసం ఇంటికి తిరిగి, చివరకు ఇంటికి బోర్డ్ వేసి, ఇంటిని వేలం వేస్తాం అని చుట్టుపక్కల వారికి తెలపడంతో మనస్థాపనతో అనారోగ్యానికి గురై హైదరాబాద్ ఆసుపత్రిలో గుండెపోటుతో మృతి చెందాడని భార్య నాగరాణి ఆరోపిస్తున్నారు. ఫైనాన్స్ కంపెనీలో ప్రమాదవశాత్తు యజమాని చనిపోతే బీమా కూడా లేదని, ఇలాంటి కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకొని, మాలాంటి పేద కుటుంబాలకు సహకారం అందించాలని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూర్ గ్రామంలో శనివారం రోజు సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దివిటి కిష్టయ్య తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 15 లక్షలు సీసీ రోడ్లు నిర్మాణానికి ఎమ్మెల్యే మంజూరు చేయించినట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని కొండాపూర్ గ్రామంలో శనివారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు మధ్యాహ్నం నుంచి నిర్వహించారు. ప్రతి సంవత్సరం హెూలీ పండుగ మరుసటి రోజు కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. రెండు తులాల వెండి కడియం వరకు కుస్తీ పోటీలను నిర్వహించారు.

ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి

నవతెలంగాణ-లింగంపేట్

ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం కచ్చితంగా అవసరమని మండల విద్యాధికారి షౌకత్ అలీ అన్నారు. శనివారం లింగంపేట మండలంలోని ఉన్నత పాఠశాల శెట్పల్లిలో ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీలో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఎక్స్ఎల్ అసిస్టెడ్ లాంగ్వేజ్ అండ్ మాథ్స్ లెర్నింగ్ ల్యాబ్‌ని మండల విద్యాధికారి షౌకత్ ఆలీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ (ఏఐ)ని పరిచయం చేస్తూ తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్ సబ్జెక్టు పైన వారి యొక్క సామర్థ్యాలను పరీక్షించనున్నట్టు తెలిపారు. అనంతరం వారి సామర్థ్యాలకు తగ్గట్టు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దిశా నిర్దేశం చేయనున్నట్టు తెలిపారు. దీని ద్వారా భవిష్యత్తులో విద్యార్థులకు కంప్యూటర్ పైన అవగాహన వచ్చి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీలో అలాగే సబ్జెక్టులలో తోడ్పాటు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుధా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యామల, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ అఖిల్ , ఉపాధ్యాయులు రవి, ప్రదీప్, రాములు, హరికిషన్, సర్దార్, మంగమ్మ ప్రవీణ్, అశోక్, సంతోష్, రాజేష్, అనురాధ అలాగే సి ఆర్ పి రాజు పాల్గొన్నారు.

అధ్యాపకుడిగా ఎంపికైనా.. పూరిగుడిసెలోనే జీవనం

- మట్టిలో మాణిక్యం.. నెరల్ తాండా వాసి

నవతెలంగాణ-గాంధారి



గాంధారి మండలంలోని నేరల్ తండాకు చెందిన బర్దావత్ మెగరాజ్ 27 ఏండ్ల వయస్సుల్లో ప్రభుత్వ అధ్యాపకుడిగా ఎంపికైయ్యారు. చిన్నప్పటినుంచి పేదరికంలో పుట్టి పెరిగి ఒకటవ తరగతి నుండి పీజీ వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రభుత్వ అధ్యాపకుడిగా మెగారాజ్ ఎంపికయ్యి శనివారం దోమకొండ ప్రభుత్వ కళాశాలలో బాధ్యతలు స్వీకరించారు. పూరి గుడిసెలో జీవనం సాగిస్తూ విద్యపై ఆసక్తితో పేదరికం జయించి ప్రభుత్వ అధ్యాపకుడిగా ఎంపిక కావడంతో గ్రామస్తులు ఆయన కృషిని అభినందిస్తున్నారు. అతి చిన్న వయసులోనే ప్రభుత్వ అధ్యాపకుడిగా ఎన్నిక కావడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు. యువత ఆయన ఆదర్శంగా తీసుకొని యువత ఉన్నత శిఖరాలు చేరుకోవాలని స్థానికులు యువతకు చూస్తున్నారు.



బర్దావత్ మెగరాజ్ నివాసించే గుడిసె

కులాన్ని నిర్మూలిద్దాం.. బహుజన సమాజాన్ని నిర్మిద్దాం

- కాన్షిరాం ఆశయాలను కొనసాగిద్దాం : అంబేద్కర్ సంఘం నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

కులాన్ని నిర్మూలిద్దాం.. బహుజన సమాజాన్ని నిర్మిద్దామని దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టిన గొప్ప వ్యక్తి కాన్షిరాం అని అంబేద్కర్ సంఘం నాయకులు, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర నాయకులు తలారి ప్రభాకర్ అన్నారు. జిల్లాలోని బీబీపేట మండలం తుజాల్‌పూర్ గ్రామంలోని అంబేద్కర్ సంఘంలో కాన్షిరాం జయంతి వేడుకలను ఘనంగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా మానవ హక్కులకు దూరంగా ఉంచబడిన పీడిత జనులను విముక్తి చేయడానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తన జీవితం చివరి వరకు కృషి చేస్తే, ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకుని మరణించే వరకు అందుకోసం పోరాడిన గొప్ప యోధుడు కాన్షీరాం అన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, రమేష్, ప్రేమ్ కుమార్, సూర్యం, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కలలు నిజం చేసుకోవాలి

- పలు పాఠశాలల్లో విజయస్ఫూర్తి

నవతెలంగాణ-లింగంపేట్



విద్యార్థులకు పరీక్ష అట్టలు అందజేత

విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడేందుకు, కలలు కనాలి వాటిని నిజం చేసుకోవాలని ప్రతివిద్యార్థి అబ్దుల్ కాలం కావచ్చు అని హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు అన్నారు. లింగంపేట్ మండలంలోని పోతాయిపల్లి, పోల్కంపేట్, ఐలపూర్, భవానీపేట్ ఉన్నత పాఠశాలల్లో శనివారం హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ తరపున పదవ తరగతి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ విజయస్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధిలు అజయ్, సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని మానసిక ప్రశాంతతతో చదివితే చదివిన అన్ని అంశాలు గుర్తు ఉంటాయని పరీక్షల పట్ల భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకుని రావాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజల్ రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు సురేష్, నర్సింలు, దేవేందర్, నారాయణరావు, సాయన్న, తిరుపతి, బన్సీలాల్,తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో శ్రమిస్తేనే విజయం

- హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు



విద్యార్థులకు అట్టలు అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మండలంలోని చిన్న మల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు విజయ స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు చిరంజీవి, శ్యాంసుందర్ రావు, శ్రీకాంత్ లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యాన్ని ఎన్నుకొని దానికి అనుగుణంగా పక్కా ప్రణాళికను వేసుకొని అనుకున్న ప్రణాళిక ప్రకారం పట్టుదలతో శ్రమిస్తే విజయతీరాలను చేరుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు చిరంజీవి, శ్యాంసుందర్, శ్రీకాంత్, కృష్ణకర్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయి రెడ్డి , ఉపాధ్యాయ బృందం ప్రతాపరెడ్డి, ప్రవీణ్ కుమార్, రామకృష్ణ, ప్రభాకర్‌అంకం, బుచ్చిరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

- బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట
- అసెంబ్లీలో ఎమ్మెల్యే మదన్మహన్ రావు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి (లింగంపేట్)



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గత ప్రభుత్వాలు బీసీలను పట్టించుకున్న దాఖలాలు లేవని కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్దపీట వేసిందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందన్నారు. అన్ని రంగాలలో బీసీలు ముందుండాలనే ఉద్దేశంతో ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా మహిళా సాధారకత కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేసిందన్నారు. మహిళలు లను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు ఆర్థికంగా రాజకీయంగా విద్యాపరంగా అన్ని రంగాల్లో ముందు ఉంచడమే పార్టీ లక్ష్యమన్నారు. యువతకు అడ్వాన్స్ టెక్నాలజీతో యువత నైపుణ్యాన్ని కల్పించడానికి అడ్వాన్స్ టెక్నాలజీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు.

అక్రమంగా కలప రవాణా

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో ప్రతిరోజూ సాయంత్రం అయిం దంటే చాలు ట్రాక్టర్లు, లారీల్లో కలప అక్రమ రవాణా కొనసాగుతోంది. కలప ఎక్కువగా మహారాష్ట్ర బార్డర్ నుంచి వస్తున్నట్టు తెలుస్తోంది. అక్రమ కలప రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.


అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప

పరీక్ష అట్టలు వితరణ



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ఉన్నత పాఠశాలలో కీర్తిశేషులు మాదరి అన్నపూర్ణ ట్రస్ట్ చైర్మన్ శ్రీ రాజన్న ఆధ్వర్యంలో 43 మంది పదో తరగతి విద్యార్థులకు శనివారం పరీక్ష అట్టలు అందజేశారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి ప్రణాళికతో చదివి ఉత్తమ మార్కులు సాధించాలని అన్నారు. గత 30 సంవత్సరాలుగా ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోటస్ స్మార్ట్ స్కూల్ విద్యార్థినికి నృత్యశ్రీ అవార్డు



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లోటస్ స్మార్ట్ పాఠశాలలో చదువుతున్న గడ్డం శ్రీహితకు నృత్యమాల నిత్యకలా వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ వారు సంయుక్తంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో అంతర్జాతీయ మహిళల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్ర నాట్యంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు నృత్యాశ్రీ అవార్డును ప్రదానం చేశారు. శనివారం అవార్డ్ పొందిన విద్యార్థికి పాఠశాల కరస్పాండెంట్ అంబిక పవార్ అభినందిస్తూ ఈ అవార్డు పొందటం తమ పాఠశాలకే కాకుండా ఆర్మూర్ పట్టణానికి గర్వకారణమని తెలిపారు. గతంలో ఈ విద్యార్థికి కూచిపూడి నాట్యంలో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా స్థానం సంపాదించిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లితండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన షబ్బీర్‌అలీ


వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పట్టణంలోని పలు ఈద్గాలను సందర్శించి రంజాన్ పండుగ వస్తున్న సందర్భంగా ఈద్గాల వద్ద వసతులను, అభివృద్ధి పనులను ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. పట్టణంలోని జదీద్ ఈద్గా, మదీనా ఈద్గా, ఐలే హదీస్ ఈద్గాలను సందర్శించి మదీనా ఈద్గా అభివృద్ధికి, బోర్ మోటర్ అక్కడి స్థలాన్ని చదును చేయడానికి 300 ట్రిప్పుల మొరం వేయించడానికి అలాగే పండుగ రోజు తాగునీరు, అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా పనులన్నీ సమయానికి సక్రమంగా జరగాలని అధికారులను ఆదేశించారు.

వాట్సప్ మెస్సెజ్ చూసి ఆర్థిక సహాయం అందజేత


ఆర్థిక సాయం చేసిన కాంగ్రెస్ నాయకులు, సర్వ సమాజ్ కమిటీ కో కన్వీనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన మెసేజ్‌ను చూసి నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్వ సమాజ్ కమిటీ కో కన్వీనర్ అదే ప్రవీణ్‌కుమార్ మరోసారి దయార్ధ్ర హృదయాన్ని చాటుకున్నారు. శుక్రవారం షేక్ సల్మాన్ అనే వ్యక్తి ఒక వాట్సాప్ గ్రూప్‌లో ఈ పవిత్రమైన రంజాన్ మాసంలో తన కుటుంబం ఆకలితో పస్తులుంటున్నామని, మీకు తోచిన సహాయం చేయాలని కోరాడు. ఆ మెసేజ్‌ను చూసిన ఆదే ప్రవీణ్ కుమార్ తక్షణమే స్పందించి వారికి నెలన్నరకు తినడానికి సరిపడా సరుకులను అందించి ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో ఈర్ల శేఖర్, వేముల దేవిదాస్, స్వర్గం రమేష్, పాశకంటి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

230 గ్రాముల గంజాయి పట్టివేత

నవతెలంగాణ-కంఠేశ్వర్



నగరంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అమ్ముతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని 230 గ్రామంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ నగర సీఐ శ్రీనివాసరాజు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు విశ్వసనీయ సమాచారం మేరకు ఈనెల 14 రాత్రి ఎన్జీవోఎస్ కాలనీలో గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని గంజాయి అమ్ముతున్న నిర్మల్ జిల్లా గాజుల నర్సాపూర్‌కు చెందిన కోడె సంపత్ అనే వ్యక్తిని పట్టుకున్నారు. అతని వద్ద 230 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నేరస్తుడు గంజాయిని నాందేడ్ నుండి తీసుకొని ఇక్కడ నిజామాబాద్‌లో కొంత మందికి అమ్ముతున్నట్లు అంగీకరించాడు. పంచనామా చేసి పోలీసులు అతడిని అరెస్టు చేశారు. గంజాయి డ్రగ్స్ సేవించే వారిపై, అమ్మే వారు, కొనేవారిపైన నిఘా ఉంచినట్టు తెలియజేశారు. సమావేశంలో ఎస్ఐ హరిబాబు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు పాటుపడాలి

- అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం సంబంధిత శాఖల అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో పౌర సరఫరాల శాఖ, సివిల్ సప్లైస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలను తెలియజేస్తూ, చట్ట పరిధిలో ఎలాంటి సేవలు పొందవచ్చు, వస్తు, సేవలలో మోసాలు ఎదురైనప్పుడు ఎవరికి ఫిర్యాదు చేయాలి, తదితర అంశాలపై వినియోగదారులను చైతన్య పర్చే కార్యక్రమాలు నిర్వహించాలని వినియోగదారుల సంఘాలకు సూచించారు. వస్తువుల నాణ్యత, వాటి ప్రమాణాల గుర్తింపు తదితర అంశాలపై వినియోగదారులకు అవగాహన ఉన్నప్పుడే, నాసిరకం, నాణ్యతా లోపాలను గుర్తించి తమ హక్కుల కోసం ఫిర్యాదు చేయగల్గుతారని అన్నారు. వినియోగదారుడు తన హక్కులు, బాధ్యతలను తెలుసుకున్నప్పుడే నాణ్యమైన వస్తువులు, సంతృప్తికర సేవలు పొందేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఒకవేళ ఏదైనా సందర్భంలో మోసాలకు గురైతే న్యాయం పొందేందుకు వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాలు దోహదపడతాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు వినియోగదారులకు వారి హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని హితవు పలికారు. నేటి రోజుల్లో అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నాణ్యమైన వస్తువులు, సేవలను గుర్తించేందుకు గల అవకాశాలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెందోట అనిల్ కుమార్, సందు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శి మహాదేవుని శ్రీనివాస్, యాటకర్ల దేవేష్, పొడపల్లి అనిల్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చేతులకు పొక్కులొస్తున్నాయి

- ఎండకు గాబరా పడుతున్నాం
- అయినా కూలి రూ.100నే వస్తోంది
- ఉపాధిహామీ టీఏకు విన్నవించిన కూలీలు

నవతెలంగాణ-వర్ని


అధికారులకు సమస్యను వివరిస్తున్న కూలీలు

'ఎండలు మండిపోతున్నాయి. గట్టి భూమిని తవ్వి.. తవ్వి.. అర చేతులకు పొక్కులు వస్తున్నాయి. అయినా మాకు కూలి రూ.100 నే వస్తోంది.' అని ఉపాధి హామీ కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం చందూర్ మండలం ఘన్‌పూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులను ఉపాధిహామీ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ.. 'ఒకే మండలంలో ఒక గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు రూ.250 వస్తున్నాయి. మేము సైతం అంతే పని చేసినా మాకు రూ.100 నే వస్తున్నాయి. పై ఉపాధి హామీ అధికారులు లోతు తవ్వాలి, పొడవు తవ్వాలి అని ఆంక్షలు పెట్టడంతో పని చేయలేకపోతున్నాం. తమకు రూ.250 కూలీ చెల్లించాలి. ప్రభుత్వం గతంలో గడ్డపార, నీటి, రవాణ, టెంట్ వసతులు కల్పించి అందులో గడ్డపార కూలీ వేసే వారు. ప్రస్తుతం ఆ ఛార్జీలు కూడా ఇవ్వకపోగా చేస్తున్న పనికి రూ.100 మాత్రమే చెల్లించటంతో మా కుటుంబాలు బతికేది ఎలా..?' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వెంటనే రోజు కూలి రూ.250 చెల్లించాలని, కొలతలు, లోతులలో మినహాయింపు చేయాలని, లేని పక్షంలో ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని కూలీలు హెచ్చరించారు. అనంతరం ఉపాధి హామీ టీఏ దేవిసింగ్ మాట్లాడుతూ.. పని ఎంత వరకు చేస్తే ప్రభుత్వం అంత కూలీ చెల్లిస్తుందని తెలిపారు. లోతు, వెడల్పు, పొడవులో కరెక్ట్ ఉన్న వారికి కూలీ ఎక్కువగా వస్తుందని, పని విధానంలో తక్కువ చేస్తే కూలీ రాదని తెలిపారు. నీటి వసతి కలిపిస్తున్నామని వివరించారు. కూలీలకు ఎక్కువ డబ్బులు వచ్చేలా పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

సాంకేతిక పరిజ్ఞానం అవసరం

- ఆక్స్‌ఫర్డ్ పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్

నవతెలంగాణ-ఆర్మూర్



రోబోటిక్స్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరమని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ అన్నారు. పట్టణ పరిధిలోని గాంధీనగర్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన 3 రోజుల రోబోటిక్స్ వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక రంగాలలో పరిజ్ఞానం ఎంతో అవసరమని ఆయన అన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానం నానాటికీ నూతన పుంతలు తొక్కుతోందన్నారు. ఇలాంటి పోటీ పరిస్థితుల్లో ప్రతి విద్యార్థికి సాంకేతిక పరిజ్ఞానం అవసరమని, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు దీనిపై పట్టు సాధించాలని ఆయన అన్నారు. నేర్చుకున్న టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని దుర్వినియోగం కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా హాజరైన రోబో చాంప్ సంస్థ అధినేత నిజామీ మాట్లాడుతూ విద్యార్థులు చాలా ఉత్సాహంతో రోబో నిర్మాణాన్ని సునాయాసంగా నేర్చుకున్నారని వారిని ప్రశంసించారు. పాల్గొన్న విద్యార్థులకు వారి సంస్థ తరపున సర్టిఫికెట్‌లను అందజేశారు. విద్యార్థులు స్టేజిపైన 8 రోబోలను తయారు చేసి వాటి పనితీరును అతిథులు ఉపాధ్యాయులు, విద్యార్థుల ముందు ప్రదర్శించారు. వర్క్‌షాప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పాలనాధికారిణి పద్మ ముఖ్య శిక్షణాధికారి సంతోష్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/బాల్కొండ

భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో మాన్యశ్రీ కాన్షీరాం 91వ జయంతిని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శనివారం నిర్వహించారు. సీనియర్ అడ్వకేట్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా సదానందం, టీజీవో అధ్యక్షులు మాన్యశ్రీ కాన్షిరామ్ చిత్రపటానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు మదాలే అజయ్ మాట్లాడుతూ దళిత బహుజనుల రాజ్యాధికారం కోసం తన జీవితాంతం నిరంతరం పోరాటం చేసి యూపీలో తన కన్న కలలు దళితులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారాన్ని అందించారని తెలిపారు. నేడు యూపీ తర్వాత ఏపీ అనే నినాదంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో దళితుల రాజ్యాధికారం కోసం నిరంతరం కృషి చేసిన కృషివలుడు మాన్యశ్రీ కాన్షీరాం అన్నారు. దళితుల రాజ్యాధికారానికి అడ్డుపడుతున్న మనువాదుల పీచమనిచిన మహాయోధుడని కొనియాడారు. తాను పెళ్లి చేసుకుంటే తన వర్గాలకు న్యాయం చేయలేదని జీవితాంతం బ్రహ్మచారిగానే ఉండి అట్టడుగు వర్గాల శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడ్డాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమ్ ఆర్మీ జిల్లా జనరల్ సెక్రెటరీ బత్తుల కిష్టయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్ గైక్వాడ్, ఉపాధ్యక్షుడు షేక్ మిరాజ్, సాలూర మండల్ కన్వీనర్ లక్ష్మణ్, వివిధ దళిత బహుజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ: ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు బహుజన రాజకీయ పితామహుడు కాన్షిరామ్ జయంతి వేడుకలను శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షిరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సమాజ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు నిశాంత్, జిల్లా నాయకులు మురళి, హరప్పా, ఆత్మగౌరవ్, క్రాంతి, కిరణ్, ప్రణయ్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : అంబేద్కర్ కా దూస్రానామ్ కాన్షీరాం అని ధర్మ సమజ్ పార్టీ మండల అధ్యక్షుడు మహేష్ అన్నారు. మండల కేంద్రంలో మాన్యశ్రీ కాన్షీరాం 91వ జయంతి, ధర్మ సమాజ్ పార్టీ 2వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ.. బహుజన పోరాటయోధుడు, బహుజన దీప స్తంభం అని ఆయనను కీర్తించారు.

ప్రతి ఒక్క బహుజనుడు ఆయన ఆశయాలకు అనుగుణంగా బహుజన రాజ్యం కోసం పోరాటం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు చిన్న భూమన్న, రవి, దిలీప్, వెంగల్ రావ్, గంగ సాయిలు, నవీన్, కిరణ్, రాజు, అజిత్ తదితరులు పాల్గొన్నారు.


నిజామాబాద్ సిటీ: చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


బాల్కొండలో...


బోధన్‌లో...

నేడు క్షత్రియ ప్రాంతీయ సమాజ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

శ్రీ సోమవంశియ సహస్రార్జున క్షత్రియ (పట్కరి/ఖత్రి) ప్రాంతీయ సమాజ్ గతవారం నూతన కమిటీని ప్రకటించినట్లు నూతన కమిటీ ప్రమాణ స్వీకారాన్ని హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో గల క్షత్రియ భవన్‌లో నిర్వహించనున్నట్టు రాష్ట్ర మేనేజింగ్ కమిటీ మెంబర్ జెస్సు అనిల్ కుమార్ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ ఉపాధ్యక్షులు విశ్వనాథ్ బాలకిషన్, అధ్యక్షతగా ఎస్ఎస్‌కె రాష్ట్ర అధ్యక్షులైన విశ్రాంత ఐపీఎస్, ఐజిపి డాక్టర్ విశ్వనాథ్ రవీందర్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ ప్రమాణ స్వీకారానికి మున్సిపాలిటీలో ఉన్న మామిడిపల్లి నుంచి రాష్ట్ర మేనేజింగ్ కమిటీ మెంబర్లుగా నియామకమైన మామిడిపల్లి సమాజ్ అధ్యక్షులు ఖాందేష్ సుదర్శన్, ప్రధాన కార్యదర్శి అల్జాపూర్ దాదా నందకిషోర్, అల్జాపూర్ రాజేష్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు, అల్జాపూర్ రాజేష్, మామిడిపల్లి యువజన సమాజ్ అధ్యక్షులు బచ్చేవాల్ వేణు, దొండి కుబీర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సీపీని కలిసిన బోధన్ సబ్ కలెక్టర్



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఐపీఎస్‌ను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పుష్పగుచ్చాని అందజేసి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్‌ను స్వాగతిస్తూ అభినందించారు.

సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాది ఆనంద్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని రాంమందిర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు న్యాయవాది గటడి ఆనంద్ సమాచార హక్కు చట్టంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం దేశంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తమకు కావలసిన సమాచారం తెలుసుకోవడానికి ఈ చట్టం దోహదపడుతుందని, అవినీతి అంతమొందాలంటే ఈ చట్టంతోనే సాధ్యమన్నారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారుడు కోరిన సమాచారం 30 రోజుల్లో సంబంధిత అధికారి ఇవ్వాలన్నారు. ఇవ్వని పక్షంలో పై అధికారికి అప్పీలు వెళ్లే అవకాశం ఉందని సూచించారు. ప్రభుత్వ అధికారి దరఖాస్తుదారునికి తప్పుడు సమాచారం, అసంపూర్తి సమాచారం, తప్పుదోవ పట్టించిన అధికారికి రోజుకు 250 నుంచి 25 వేల వరకు జరిమానా విధించే అధికారం ఉందన్నారు. దరఖాస్తు ఎలా చేయాలో ఈ చట్టం ద్వారా సాధించిన విజయాలు క్లుప్తంగా వివరించారు. వార్షిక పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.1000 ప్రోత్సాహ బహుమతి ఇస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గద్దె గంగాధర్, ఉపాధ్యాయులు చంద్రకాంత్, పద్మ, మనోహర్, సురేందర్, నగేష్, సురేష్, రాజమణి, చిన్నయ్య, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | మార్చి 16, 2025 | www.navatelangana.com

రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఎడపల్లి

బీఆర్ఎస్ శాసనసభ్యులు జగదీశ్వర్ రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిష్కరించడం విచారకరమని ఎడపల్లి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీరామ్‌తో పాటు ఆ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు అన్నారు. జగదీశ్వర్ రెడ్డి బహిష్కరణకు నిరసనగా ఎడపల్లి మండల పరిధిలో గల బోధన్, నిజామాబాద్ ప్రధాన రహదారి సాటాపూర్ గేటు వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో దొడ్డి శ్రీనివాస్, సలీం, మహబూబ్, బట్టు హనుమాన్లు, యాదగిరి గౌడ్, ఆకుల సురేష్, ఆయా గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని మెండోర గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సౌండ్ సిస్టంను అందజేశారు. సుందరగిరి రామచందర్ (రాము) జన్మదినం సందర్భంగా 120 వాట్స్ కలిగిన సౌండ్ సిస్టంను విలేజ్ డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలకు సౌండ్ సిస్టంను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీడీసీ పెద్దలు, అధ్యక్షులు గౌరు రాజన్న, ఉపాధ్యక్షులు సాయిబాబా, కోశాధికారి గంగారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, రామ్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సౌండ్ సిస్టం వితరణ

విద్యార్థుల సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకే
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

- డీఈఓ అశోక్ కుమార్
- పలు పాఠశాలల్లో ప్రారంభం

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్ : విద్యార్థులలోని సామర్థ్యాలను మెరుగుపరిచేందుకే ప్రభుత్వం ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను ప్రవేశపెట్టబోతుందని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ కుమార్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని మధుమలాంచ ప్రాథమిక పాఠశాలలో ఏఐ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ మధుమలాంచ ప్రాథమిక పాఠశాలలో 197 మంది విద్యార్థులు ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారని దాంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యనందించేకు ఎంపిక చేసి పాఠశాలలో 10 కంప్యూటర్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో కంప్యూటర్లను, హెడ్ ఫోన్స్, ఇంటర్నెట్ సదుపాయంతోపాటు ఇతర అవసరమైన ఎలక్ట్రానిక్ పరికరాలను ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా స్కూళ్లలో ప్రత్యేక కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఎడ్యుటెక్ ఆధారిత శిక్షణ అందించనున్నామని తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి కోర్సు బోధనను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆరిఫ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్, సాయికిరణ్, ఉపాధ్యాయులు ప్రీతి, శివతేజ, సాగర్, శ్రీకాంత్, సిఆర్‌పి విజయ తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని తొర్లికొండ, ఎంపీపీఎస్, జడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి మూడెడ్ల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫియల్ ఇంటలిజెన్స్ ద్వారా విద్య బోధన చేయనున్నట్టు తెలిపారు. దీనిలో తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులలో విద్యార్థులు స్వతహాగా నేర్చుకుంటూ ముందుకెళ్లే విధంగా సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాంను డెవలప్ చేసినట్టు తెలిపారు. ఈ విధమైన బోధన ద్వారా విద్యార్థులకు జాయ్ ఫుల్ లర్నింగ్ మెథడ్ ద్వారా కంప్యూటర్ బోధన జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గంగా జమున, ఎంపీపీఎస్ తొర్లికొండ ప్రధానోపాధ్యాయులు జంగం అశోక్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


బోధన్ : ఏఐ లెర్నింగ్‌ను ప్రారంభిస్తున్న డీఈవో


బాల్కొండ : చిట్టాపూర్ గ్రామంలో..

ఏఐ విద్యతో విద్యార్థుల్లో నైపుణ్యం

బాల్కొండ : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం నాణ్యమైన ప్రమాణాలతో పాఠశాల విద్యను విద్యార్థులకు అందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించాలని ఇటీవల నిర్ణయం తీసుకుందని.. ఇందులో భాగంగా మండల పరిధిలోని చిట్టాపూర్, కిసాన్‌నగర్ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ -ఏఎక్స్ఎల్ (ఏఐ) ల్యాబ్‌లను శనివారం ఎంఈఓ బట్టు రాజేశ్వర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులలో మరింత మెరుగైన అభ్యసన పద్ధతులను సాంకేతిక ప్రమాణాల పెంపునకు ఏఐ క్లాసెస్ ఎంతో దోహదం చేస్తాయని, విద్యార్థులలో వ్యక్తిగత స్థాయిలో విద్యా ప్రమాణాలను, సామర్థ్యాలను ఈ విధానం ద్వారా మరింతగా మెరుగుపరచవచ్చునని అన్నారు. విద్యార్థులలో ఉన్న అభ్యసన లోపాలను గుర్తించి వాటిని సవరించడానికి చర్యలు చేపట్టొచ్చని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం సమర్థవంతంగా ఉపయోగించడానికి డిజిటల్ పద్ధతులపై పూర్తిస్థాయిలో ఇదివరకే ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ నగర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర కుమార్, చిట్టాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుబీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ ఆధారిత బోధన ప్రారంభం..

రెంజల్ : మండలంలోని జీపీఎస్ సాటాపూర్ (వీరన్నగుట్ట) ప్రాథమిక పాఠశాలలో (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) ఆధారిత బోధనను రెంజల్ మండల విద్యాశాఖ అధికారి కట్టా ఆంజనేయులు ప్రారంభించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఏఐ ఆధారిత బోధన పద్ధతుల ద్వారా మూడు, నాలుగు, ఐదవ తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు భాషా నైపుణ్యాలు, గణితం సామర్థ్యాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు కంప్యూటర్ ఆధారిత బోధన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.ఈశ్వర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాకేష్, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, ఆశ్రిత, ఉమేరా పర్వీన్, అమతుల్ తదితరులు పాల్గొన్నారు.

మచ్చర్ల ప్రాథమిక పాఠశాలలో..

ఆర్మూర్ : ఆలూర్ మండలంలోని మచ్చర్ల ప్రాథమిక పాఠశాలలో ఏఐ కంప్యూటర్ విద్యను ఆలూర్ మండల విద్యా శాఖాధికారి నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సులభంగా నేర్చుకొని చదువులో రాణిస్తారని ఎంఈఓ పేర్కొన్నారు. మచ్చర్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పండరి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుం రాజ సులోచన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలంలోని ఎంపిక చేసిన 5 ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ ఆధారిత బోధన విధానాన్ని ప్రారంభించినట్టు మండల విద్యాశాఖ అధికారి రాజగంగారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా మూడు, నాలుగు, ఐదవ తరగతిలోని వెనుకబడిన (భాష, గణితం) విద్యార్థులకు భాషా నైపుణ్యాలు గణిత సామర్థ్యాల మీద పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ఈ కంప్యూటర్ ఆధారిత విద్య చాలా ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలలో పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్న ఈ ప్రక్రియలో భాగంగా మండలంలో 5 పాఠశాలలు ఎంపికైనట్టు వివరించారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రైమరీ, ఉర్దూ మీడియం, మండలంలోని కోమన్‌పల్లి, మంథని, అంకాపూర్, సుర్బిర్యాల్ పాఠశాలలు ఎంపికైనట్టు తెలిపారు. విద్యార్థులందరూ ఈ సదుపాయాన్ని సక్రమంగా వినియోగించుకొని మంచి నాణ్యత గల అభ్యసనాన్ని కొనసాగిస్తూ విషయ పరిజ్ఞానాన్ని, సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్యామల దేవి, బాలరాజు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మేధాశక్తి పెంచేందుకు ఎఫ్ఎల్ఎన్

రాజంపేట్ : రాజంపేట్ మండలంలోని బసవన్నపల్లి ప్రాథమిక పాఠశాలలో, రాజంపేట్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆర్టిఫిషియలో ఇంటలిజెంట్స్‌కు సంబంధించిన మూడు,నాలుగు,ఐదు, తరగతుల సంబంధించి విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ స్లో లెర్నర్స్ విద్యార్థులకు మేధాశక్తి పెంపొందించెదనుకు మండల విద్యాశాఖ అధికారి పూర్ణచందర్రావు కంప్యూటర్ అథారిటీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ ఈశ్వరయ్య, విజయలక్ష్మి హెచ్ఎం, వసంత, సి ఆర్ పి లు పాల్గొన్నారు.

మాలలకు ఉద్యోగాలు.. మాదిగలకు నిరసనలా..?

- నాలుగవ రోజుకు చేరిన నిరసన దీక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఎడపల్లి

ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలు చెయ్యకుండా ఉద్యోగ నియామకాలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ చేపడుతున్న దీక్షలు శనివారానికి నాలుగవ రోజుకు చేరుకున్నాయని ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ తెలిపారు. ఈ దీక్షకు విహెచ్పిఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్పిఎస్) జిల్లా కమిటీ సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సమస్త ప్రజలు, కులాలు హెూలీ పండుగ సంబరాల్లో ఉంటే ఒక మాదిగ జాతి మాత్రమే తమ హక్కుల కోసం నిరసనలు, ఉద్యమాలు చేస్తుందన్నారు. దీనికి ప్రధాన కారణం సీఎం అని తెలిపారు. ఒకవైపు మాలలు ఉద్యోగాలు సాధిస్తూ పండగ జరుపుకుంటుంటే, మరోవైపు మాదిగలు అవే ఉద్యోగాల కోసం నిరసన కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగలకు అన్యాయం చేస్తున్నాడని అన్నారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే మాదిగలు కోరుకునే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాన్ని అసెంబ్లీలో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రొడ్డ ప్రవీణ్ మాదిగ, ఎంఎంఎస్ జాతీయ నాయకురాలు సత్తెక్క, ఎంఎంఎస్ జిల్లా నాయకురాలు స్వప్న మాదిగ, ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షులు మహేష్ మాదిగ, విహెచ్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సలీం, విహెచ్పిఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, విహెచ్పిఎస్ నాయకులు ప్రశాంత్, పోతన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక నిరాహార దీక్షలకు మద్దతుగా జాతీయ మాదిగ రాజకీయ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు డల్లా సురేష్ మాదిగ దీక్ష శిబిరాన్ని సందర్శించారు. వారికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎస్సి వర్గీకరణ అమలు చేస్తామంటూ ఉద్యోగ నియామకాలు చేపట్టడమంటే మాదిగలకు అన్యాయం చెయ్యడమేనన్నారు. దీక్షలో సావిత్రి, యమున, పాండు, భూషణం పూలదండలు వేసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో డల్లా సురేష్, మెథరి గంగాధర్, కషిగొల్ల గంగాధర్, అల్కీ పోచయ్య, జంలం ప్రభాకర్, బోప్పురం అబ్బులు, రొడ్డ సంజీవ్, పవన్ డల్లా తదితరులు పాల్గొన్నారు.

పిడిఎస్ రైస్ గోదాములపైటాస్క్‌ఫోర్స్ దాడులు

నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఇంచార్జ్ ఏసీపీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య స్పెషల్ పార్టీ సిబ్బంది కలిసి బోధన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 3 పీడీఎస్ రైస్ గోదాంలపై దాడి చేశారు. ఈ దాడిలో 2,80000 విలువ గల 8 టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని ముగ్గురు గోదాం నిర్వాహకులను అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. చేసుకున్నారు. తదుపరి చర్య నిమిత్తం బోధన్ టౌన్ సీఐకి అప్పగించారు.

పోలీసులపై హత్య నేరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలి

- బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

సైబర్ క్రైమ్ పోలీసుల కస్టడీలో మృతికి కారణమైన పోలీసులపై హత్యా నేరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్పీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం గ్రామానికి చెందిన అలకుంట సంపత్ గల్ఫ్ దేశాలకు మ్యాన్ పవర్ సప్లై లైసెన్స్‌తో కొంత మంది వ్యక్తులకు గల్ఫ్ దేశాలకు పంపారని తెలిపారు. వారికి గల్ఫ్‌లో సరైన ఉపాధి అవకాశాలు కల్పించలేదని సంపత్‌పై జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే సంపత్‌ను అరెస్టు చేశారని, కోర్టు ద్వారా కస్టడీకి తీసుకుని తీవ్రంగా మానసిక, భౌతికంగా హింసించడం వల్లే సంపత్ మృతి చెందారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత పోలీస్ అధికారులను డిస్మిస్ చేసి హత్య నేరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని తెలిపారు. సంపత్ కుటుంబ సభ్యులకు యాభై లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని సంగోజు వాడి గ్రామంలో సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేసినట్లు మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గైని శివాజీ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన వాడికారి అనూష బాయ్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి రావడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికా వద్దన్న ఉద్దేశంతో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు చొరవతో 60 వేల రూపాయల విలువ గల చెక్కును బాధితురాలకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గడ్డం లింగం, మైనారిటీ అధ్యక్షులు మహమూద్, షాబుద్దీన్, దస్తగిరి, చంద్ర రావు, పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజలను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోం

నవతెలంగాణ-ఆర్మూర్

డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు నిత్యం ఆధార్ నమోదు చేసుకోవడానికి, మార్పులు చేర్పులు చేసుకునేందుకు మీసేవ సెంటర్లకు వస్తున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆరేపల్లి సాయిలు అన్నారు. మీసేవ నిర్వాహకుల ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులను తెలియజేస్తూ శనివారం పట్టణ తహసిల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధార్ నమోదు ప్రక్రియ పూర్తయిందని, చరవాణి ద్వారా మెసేజ్ రావడంతో ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తే ఆధార్ ప్రక్రియ జరిగిన తెల్లవారే నమోదు రద్దు అయిందని మెసేజ్ వస్తుందని దీనిపై మీ సేవ సెంటర్ వాళ్ళను అడిగితే తమ చేతుల్లో ఏమి లేదనీ, మళ్ళీ ఆన్లైన్‌లో అప్లై చేసి నోటరీ కొట్టించి తీసుకుని రావాలని అంటున్నారని అన్నారు. తక్షణమే అధికారులు సాంకేతిక కారణాలకు గల కారణాలు తెలుసుకుని ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరుతూ సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సోమా శ్రీను, నవాబు, మోహిన్, నరేష్, రాజేందర్, పరశురామ్, మంగమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్‌రెడ్డి సభ్యత్వం రద్దు చేయాలి

- టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

గత గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఏకవచనంతో సభ నీ సొంతం కాదంటూ మాట్లాడి గౌరవ స్పీకర్ స్థానాన్ని అగౌర పరిచిన సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి శాసన సభ సభ్యత్వాన్ని రద్దుచేయాలని టీపీసీసీ అధికార అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహుజనుడు స్పీకర్ స్థానంలో ఉండడాన్ని బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక పోతున్నారని, మొదటి నుంచి బడుగు బలహీన వర్గాలకు వ్యతిరేకులు కేసీఆర్, కేటీఆర్ లేనన్నారు. బహుజనులంటే ఇంత అసహనమా? ఎందుకింత అహంకారమని ప్రశ్నించారు. బడుగు బలహీన వర్గాలు లేకుండానే మీరు ఎమ్మెల్యేగా గెలిచారా? మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జగదీశ్‌రెడ్డికి శాసన సభను, స్పీకర్ స్థానాన్ని గౌరవించాలని తెలియదా అన్నారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ నాయకుడిగా ఉన్న దళితుడైన భట్టి విక్రమార్కని కూడా ఇలానే అవమానపరిచారన్నారు. ప్రతిపక్ష పాత్ర లేకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, టిడిపి ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో కలుపుకొని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన ఘనుడు కేసీఆర్ కాదా అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేపట్టి కులగణనను చేపడితే కనీసం సర్వేలో కూడా కేసీఆర్ కుటుంబం పాల్గొనలేని వీళ్ల దళిత బహుజన వ్యతిరేకులన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ కల్పించాలని శాసనసభలో తీర్మానం చేస్తే, దానిని కూడా హేళన చేసే విధంగా మాట్లాడారని ఆయన విమర్శించారు. దళితులను బడుగు బలహీనర్గాల పట్ల మీ వైఖరిని మార్చుకోకపోతే కేసీఆర్‌ను తెలంగాణ సమాజం క్షమించదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సుంకేట రవి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నరసయ్య, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగెల ప్రవీణ్, నాయకులు నిమ్మ రాజేంద్రప్రసాద్, రేవతి గంగాధర్, సుంకేట శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రెడ్డబోయిన నరేంద్ర ముదిరాజ్, గణేష్‌గౌడ్, అజారుద్దీన్, సక్కరం నర్సయ్య, కుందేటి శ్రీను, నాగరాజ్, రంజిత్, ఉబేదుళ్ళ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేణుగోపాల్ యాదవ్

బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి

- ఎన్ఎస్‌యూఐ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రెహమాన్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రెహమాన్ అన్నారు. శనివారం మండల పోలీస్ స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ.. విద్యార్థి నాయకులమనే ముసుగులో కొంతమంది సీఎం ప్రతిష్టను దెబ్బతీసే విధంగా దురుద్దేశంతో సోషల్ మీడియాలో మార్ఫింగ్ చేసి అభ్యంతరకరమైన రీతిలో ప్రవర్తించడం దారుణమని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంపై నిరసన తెలపడంలో ఎవరికీ అభ్యంతరం ఉండదని కానీ.. ఆ నిరసన హుందాగా ఉండాలే తప్ప ఇతరుల మనోభావాలను వారి ప్రతిష్టను, హెూదాను, గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉండకూడదన్నారు. మరి ముఖ్యంగా విద్యార్థి నాయకులమని చెప్పుకుంటూ విద్యార్థి సంఘాల పరువు తీయకూడదని, చదువుకునే విద్యార్థి నాయకులు ప్రభుత్వంపై నిరసన తెలిపే విధానం ప్రజలను చైతన్య పరిచేలా ఉండాలే తప్ప చీదరించుకునే వాటిలా ఉండకూడదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు పద్ధతి మార్చుకోవాలని లేనిపక్షంలో వారికి ఎన్ఎస్‌యుఐ నాయకులు తగిన బుద్ధి చెప్తారని, సహనాన్ని చేతకానితనంగా తీసుకోవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు డానిష్, ఈశ్వర్, సాయి, దినేష్, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాలలో దివ్యంగుల గుర్తింపు రికార్డు సేవలపై అవగాహన కల్పించడానికి వరల్డ్ డిసేబుల్డ్ డేను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రంగ వేంకటేశ్వరగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి వచ్చే సౌకర్యాలను ఉపయోగించుకోవాల్సిన బాధ్యత దివ్యాంగ పిల్లలు కలిగిన తల్లితండ్రులు ముందుండాలన్నారు. దివ్యాంగులు సాధించలేనిది ఏదీ లేదని వారిని ప్రోత్సహించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించే సత్తా కలిగిన వారీగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ టీచర్లు శ్రీనివాస్, పెంటయ్య, విజయ్లు, సైన్సు టీచర్లు శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల, కాటేపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను ఎస్ఐ మహేందర్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో దాదాపుగా వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు సంబంధించిన విద్యార్థులే ఉన్నారని, వారికి సహకారంగా పరీక్ష ప్యాడ్లు అందించినట్టు తెలిపారు. రాబోయే వార్షిక పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. బాలికల భద్రతే షీ టీమ్స్ లక్ష్యమని తెలిపారు. పాఠశాలలో కానీ, బయట ఎక్కడైన ఆకతాయిలు బాలికలను భయాందోళనలకు గురిచేసినా, వేధించినా, ఇబ్బందికరంగా మాట్లాడిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 100, 181కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


పరీక్ష అట్టలు పంపిణీ

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపల్ బి సురేఖ తెలిపారు. శనివారం మ్యాథ్స్, జువాలజీ పరీక్షలకు 187 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 185 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇద్దరూ గైరాజర్ అయ్యారని తెలిపారు. 8 గంటల 55 నిమిషాలకు ఓ విద్యార్థి పరీక్ష కేంద్రంలోకి పరిగెత్తుకుంటూ వెళ్లారు. కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.